క్లుప్తంగా

అఘాయిత్యాలను అడ్డుకుందాం



మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకుడు

కొయ్యలగూడెం: బాలికలు, యువతులు, మహిళలపై జరిగే అఘాయిత్యాలను కలిసికట్టుగా అడ్డుకుందామని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం గవరవరంలోని వెంకటపతిరాజు ఎడ్యుకేషనల్ సంస్థలో ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల విద్యార్థినులతో సమ్మేళనం నిర్వహించారు. మహిళా సంఘం అధ్యక్షురాలు నాగమణి, ఎస్ఎఫ్ఐ, జిల్లా ఉపాధ్యక్షుడు యు.వినోద్, మండల కమిటీ అధ్యక్షురాలు బిందు ప్రియదర్శిని పాల్గొన్నారు. అనంతరం నాయకులు బాలికలతో కలిసి కొయ్యలగూడెం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి వేధింపులకు పాల్పడుతున్న యువకులపై ఫిర్యాదు చేశారు.

పోరాటాలను బలపరచాలి



సభలో నినదిస్తున్న ఇఫ్టూ నాయకులు

జంగారెడ్డిగూడెం: దళితుల ఆత్మగౌరవ పోరాటాలను బలపరచాలని ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ పిలుపునిచ్చారు. చుండూరులో దళితులపై దాడి జరిగి 32 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మంగళవారం స్థానిక అశ్వారావుపేటరోడ్‌లో మద్దిపాటి పోలయ్య అధ్యక్షతన సభ నిర్వహించారు. కారంచేడు, చుండూరు దళిత మృత వీరులకు జోహార్లర్పించారు. రమణ మాట్లాడుతూ దళితులు, ఆదివాసీలకు ఉన్న హక్కులను తొలగించేందుకు నేటి పాలకులు చేస్తోన్న కుట్రలను సమష్టిగా అన్ని వర్గాల ప్రజలు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డి.భగీరథ, పులపాకుల సుబ్బారావు, పింగళి కృష్ణ, పఠాన్ జిన్నా, ఆడమిల్లి వెంకటేష్, కలపాల బెనర్జీ, మాణికల రాజు, మద్దిపాటి సుబ్బారావు పాల్గొన్నారు.

స్వీయ రక్షణలో మెలకువలు తెలుసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న కరాటే మాస్టర్ మోహన మురళీకుమార్

ద్వారకాతిరుమల: ప్రతి విద్యార్థీ స్వీయ రక్షణలో మెలకువలను తెలుసుకోవాలని ద్వారకాతిరుమల–2 సచివాలయం మహిళా పోలీస్ లక్ష్మీ సుజన అన్నారు. ద్వారకాతిరుమలలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాల, ఎంపీయూపీ పాఠశాలలో మంగళవారం స్వీయ రక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు భీమడోలుకు చెందిన బ్లాక్ బెల్ట్ థర్డ్ డాన్ కె.మోహన మురళీకుమార్ స్వీయ రక్షణలో అవసరమైన మెలకువలను వివరించారు. ప్రమాదం వచ్చినప్పుడు ఎలా బయటపడాలనే విషయాలను ప్రాక్టికల్‌గా చేసి చూపించారు. ఈ సందర్భంగా మహిళా పోలీస్ లక్ష్మీ సుజన మాట్లాడారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ బి.రాణి, సిబ్బంది, ఎంపీయూపీ పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న నాయకులు

వేలేరుపాడు: సీపీఐ స్థానిక కార్యాలయంలో వరద బాధితులకు సీపీఐ నాయకులు సాయం అందించారు. మండలంలో గత నెలలో వచ్చిన వర్షాల కారణంగా నష్టపోయిన తెల్లవల్లి గ్రామానికి వలస వచ్చిన గొత్తికోయకు సంబంధించిన 25 కుటుంబాలకు సీపీఐ రాష్ట్ర, జిల్లా పార్టీల సహకారంతో దుస్తులు పంపిణీ చేశారు. పార్టీ మండల కార్యదర్శి బాడిశ రాము, పోలవరం నియోజకవర్గ కార్యదర్శి కారం దారయ్య తదితరులు పాల్గొన్నారు.

భాస్కర్‌రావు సేవలు ప్రశంసనీయం



భాస్కరరావును సన్మానిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: ఏజెన్సీ మెట్ట ప్రాంతంలో పీడబ్ల్యూడీ ఏఈ సీహెచ్ భాస్కరరావు అందించిన సేవలు ప్రశంసనీయమని ఆ శాఖ డీఈలు పి.రవీంద్ర, డి.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మంగళవారం పీడబ్ల్యూడీ కార్యాలయం వద్ద భాస్కరరావు ఉద్యోగ విరమణ, అభినందన కార్యక్రమం సర్పంచ్ ముప్పిడి విజయ కుమా రి ఆధ్వర్యంలో నిర్వహించారు. భాస్కరరావు రైతు సమస్యల పట్ల స్పందించిన విధానం యువ ఇంజినీర్లకు ఆదర్శమని ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ పెన్మెత్స శ్రీనివాసరాజు పేర్కొన్నా రు. ఇరిగేషన్ శాఖ అధికారులు, రైతు నాయకులు పాల్గొన్నారు.

మన్యం రోడ్లపై నడక యాతన

- వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు
- రాకపోకలకు గిరిజనుల అవస్థలు
- కనీస మరమ్మతులకు డిమాండ్

బుట్టాయగూడెం: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఏజెన్సీ ప్రాంతంలోని మారుమూల గ్రామాలకు వెళ్లే రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయి. కోతలకు గురైన రోడ్లపై నడిచేందుకు కూడా అనువుగా లేదని గిరిపుత్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం మరమ్మతులైనా చేపట్టాలని వారు కోరుతున్నారు. బుట్టాయగూడెం మండలంలోని మారుమూల గ్రామమైన రేపల్లె, రేగులపాడు, డోలుగండి గ్రామాలతోపాటు మోదేలు గ్రామాలకు వెళ్లే రహదారులు పూర్తిగా పాడయ్యాయి. గురుగుమిల్లి నుంచి చింత కొండ వెళ్లే రహదారి, కోర్సవారిగూడెం రహదారులు కూడా దెబ్బతిన్నాయి. ఆ రహదారులపై ప్రయాణం చేయాలంటే ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా రేపల్లె, రేగులపాడు, డోలుగండి రహదారులు దెబ్బతినడంతో ఆయా గ్రామాల్లో నివసిస్తున్న గిరిజనులు తమ అవసరాల కోసం దొరమామిడి, బుట్టాయగూడెం రావాలంటే వారి బాధలు వర్ణనాతీతంగా మారాయి. ఆ రహదారులపై ద్విచక్ర వాహనంపై దిగువ ప్రాంతానికి వచ్చి కూరగాయలు, నిత్యావసర వస్తువులు తీసుకుని ఆయా గ్రామాలకు వెళ్లే పరిస్థితి లేదు. వర్షాలకు రోడ్లు పూర్తిగా దెబ్బతినడంతో దిగువ ప్రాంతానికి రావాలంటే కాలినడకనే అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో రహదారులు దెబ్బతినడం వల్ల తమ పరిస్థితి ఏంటని గిరిజనులు వాపోతున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో అలివేరు నుంచి రేపల్లెకు వెళ్లే రహదారి జోడిమామిడి వరకు తారు రోడ్డు నిర్మించారు. ఆపై రహదారులు ప్రస్తుతం పూర్తిగా దెబ్బతిన్నాయి. ఐటీడీఏ అధికారులు, ప్రభుత్వం స్పందించి ఆయా గ్రామాలకు దెబ్బతిన్న రహదారులను కనీస మరమ్మతులు చేపట్టి గిరిజనులకు ఇబ్బంది కలుగకుండా చూడాలని గిరిజనులు కోరుతున్నారు.



రేపల్లె రోడ్డు దుస్థితి ఇలా..



అధ్వానంగా మారిన రేగులపాడు వెళ్లే రోడ్డు



వర్షాలకు దెబ్బతిన్న అలివేరు వెళ్లే రహదారి



వర్షాలకు కొట్టుకుపోయిన డోలుగండి రోడ్డు

అడుగడుగునా రోడ్డుకు కోత

మోదేలు గ్రామం పరిస్థితి కూడా అధ్వానంగా మారింది. ఆ గ్రామానికి వెళ్లాలంటే అడుగడుగునా రహదారి పూర్తిగా కొట్టుకుపోవడంతో ఆ గ్రామ గిరిజనులు నానా అవస్థలు పడుతున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో ఆ గ్రామానికి రూ.3 కోట్లతో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు కాగా ఫారెస్ట్ అధికారుల అభ్యంతరాలతో ఆ పనులు నిలిచిపోయాయి. ప్రస్తుతం రహదారి పూర్తిగా దెబ్బతినడంతో మోదేలు గిరిజనులకు రహదారి కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. అధికారులు స్పందించి తమ గ్రామానికి కూడా రహదారి నిర్మించే విధంగా కృషి చేయాలని మోదేలు గిరిజనులు కోరుతున్నారు.

మరమ్మతులు చేపట్టాలి



మోదేలు, రేపల్లె, రేగులపాడు, డోలుగండి రహదారుల పనులను చేపట్టే విధంగా ఐటీడీఏ అధికారులు కృషి చేయాలి. పాడైపోయిన రోడ్లపై కొండరెడ్డి గిరిజనులు అనేక అవస్థలు పడుతున్నారు.

– కె.రాఘవ, న్యూడెమోక్రసీ నాయకుడు, అలివేరు, బుట్టాయగూడెం మండలం

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



ట్రాఫిక్ నిబంధనలపై కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ రవిచంద్ర

జంగారెడ్డిగూడెం: ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని జంగారెడ్డిగూడెం డీఎస్పీ యు.రవిచంద్ర హెచ్చరించారు. పట్టణంలో సీఐ రాజేశ్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ నిబంధనలపై మంగళవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించిన వారికి జరిమానాలు విధించారు. అనంతరం వారికి స్టేషన్ ఆవరణలో కౌన్సెలింగ్ నిర్వహించారు. డీఎస్పీ రవిచంద్ర మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం తప్పనిసరి అన్నారు. మితిమీరిన వేగం, ట్రిబుల్ రైడింగ్, శబ్దకాలుష్యంతో వాహనాలు నడుపుతున్నారని, అటువంటి వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రత్యేక డ్రైవ్లో భాగంగా 35 ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నామని, వీటిలో వాహన పత్రాలు, లైసెన్సులు లేకుండా వాహనాలు నడుపుతున్న మైనర్లే అధికంగా ఉన్నారని డీఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో సీఐ రాజేశ్, ఎస్సై జ్యోతిబాస్, ట్రాఫిక్ ఎస్సై రామకృష్ణ పాల్గొన్నారు.

తల్లిపాలు అమృతతుల్యం

కొయ్యలగూడెం: తల్లిపాలు బిడ్డకు అమృత తుల్యమని, పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టించడం ఎంతో ఆరోగ్యమని ఐసీడీఎస్ పీఓ యూఎస్ స్వర్ణ కుమారి పేర్కొన్నారు. చొప్ప రామన్నగూడెం గ్రామంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సూపర్‌వైజర్ అంబటి సరస్వతి ఆధ్వర్యంలో నిర్వహించిన వారోత్సవాల అవగాహన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బోడిగూడెం, మంగపతి దేవి పేట గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. సూపర్‌వైజర్ ఎ.నయోమిరాణి, కె.నాగకుమారి, జీవీవీ నాగమణి, సీహెచ్ పాప, కె.సునీత రాణి, సీహెచ్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

శిశువులకు తల్లిపాలు శ్రేష్ఠం

బుట్టాయగూడెం: నవజాత శిశువులకు తల్లిపాలే శ్రేష్ఠమైనవని సూపర్‌వైజర్ కె.ఝాన్సీ అన్నారు. మండల కేంద్రమైన బుట్టాయగూడెం ఎంపీడీఓ కార్యాలయం వద్ద మంగళవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు నూర్జహాన్, మున్ని, వసుంధర, సుధ, శ్యామల, దయామణి, నాగమణి, ఇంజినీరింగ్ కన్సల్టెంట్ ఎ.సృజన, వెలుగు సిబ్బంది, బాలింతలు, గర్భిణులు, బాలింతలు, తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలతో శిశువుకు ఆరోగ్యం

కుక్కునూరు: తల్లిపాలతో శిశువులకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని కుక్కునూరు ఐసీడీఎస్ సీడీపీఓ ఎన్ లక్ష్మికుమారి అన్నారు. మంగళవారం కుక్కునూరు–2 అంగన్‌వాడీ సెంటర్‌లో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ఐసీడీఎస్ సిబ్బంది గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.



బుట్టాయగూడెం : ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహిస్తున్న తల్లిపాల వారోత్సవం



కుక్కునూరు : తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది



కొయ్యలగూడెం : చొప్పరామన్నగూడెంలో మాట్లాడుతున్న పీఓ స్వర్ణకుమారి

బంగారం తాకట్టుదారుల వివరాలు తప్పనిసరి

జంగారెడ్డిగూడెం: బంగారం తాకట్టు పెట్టేందుకు వచ్చే ఖాతాదారుల పూర్తి సమాచారం ప్రైవేటు తాకట్టు వ్యాపారులు, కంపెనీల వద్ద ఉండాలని డీఎస్పీ రవిచంద్ర అన్నారు. జంగారెడ్డిగూడెం సర్కిల్ కార్యాలయంలో స్థానిక ప్రైవేటు తాకట్టు వ్యాపారుల, కంపెనీల ఉద్యోగులతో ఆయన మంగళవారం సమావేశం నిర్వహించారు. ఇటీవల బంగారం విలువ బాగా పెరిగిపోవడంతో చోరీలు కూడా పెరుగుతున్నాయని, వీటిని అరికట్టేందుకు జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని చెప్పారు. చోరీ చేసిన బంగారాన్ని తాకట్టు పెడుతున్నారని, తాకట్టు వ్యాపారం చేసే వారు బంగారం తాకట్టు పెట్టే వారి పూర్తి వివరాలను తమ వద్ద ఉంచుకోవాలని సూచించారు. ఫైనాన్స్ సంస్థల్లో బంగారు రుణాలు సులభంగా పొందే వెసులుబాటు ఉండటంతో ఎవరు పడితే వారు బంగారం కుదవ పెడుతున్నారని, బంగారం తీసుకువచ్చిన వ్యక్తుల వివరాలు సరైనవిగా ఉండేలా చూసుకోవాలన్నారు. అనుమానం ఉంటే పోలీసులకు సమాచారం అందించాలని డీఎస్పీ సూచించారు. కార్యక్రమంలో సీఐ రాజేశ్, ఎస్సై జ్యోతిబాస్ పాల్గొన్నారు.



బంగారం తాకట్టు వ్యాపారులతో మాట్లాడుతున్న డీఎస్పీ రవిచంద్ర

నిత్యావసర సరుకుల పంపిణీ

వేలేరుపాడు: గోదావరి వరద బాధితులకు సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఎర్రతోగు గ్రామానికి నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. గ్రామస్తులకు నిత్యావసర సరుకులు, బియ్యం, ఉల్లిపాయలు, బెండకాయలు, వంట పాత్రలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ వేలేరుపాడు మండలంలోని ఇటీవల కాలంలో కురిసిన భారీ వర్షాలకు గోదావరి వరదలు గ్రామాలకు గ్రామలే నీట మునిగాయని, బయటకు రావడానికి నేటికీ అనేక ఇబ్బందులు పడుతున్న గ్రామాలు ఉన్నాయని వివరించారు. మూడు నెలలుగా మండలంలో ఉపాధి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, చేసిన ఉపాధి హామీ పథకం పని డబ్బులు పడకపోడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన దుస్థితి నెలకొన్నదని వివరించారు. ప్రభుత్వం సాయం ఏదైనా మండలాన్ని యూనిట్‌గా తీసుకొని ఇవ్వాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతమంతటా ఏకాదటిగా కురుస్తున్న వర్షలకు విష జ్వరాలు కూడా ప్రబలుతున్నాయని, ప్రతి గ్రామంలో హెల్త్ క్యాంపులు నిర్వహించాలని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు తెల్లం రామకృష్ణ, మడివి దుర్గారావు, ధర్ముల రమేష్, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు కుంజా నవీన్ ప్రసాద్‌రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి తదితరులు ఉన్నారు.



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న నాయకులు

● రోడ్డు అధ్వానం.. విద్యార్థుల ఆగ్రహం



మంగపతిదేవిపేట రోడ్డు అధ్వానంపై నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

మంగపతిదేవిపేట – కొయ్యలగూడెం రోడ్డు అధ్వాన స్థితి పట్ల విద్యార్థులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. మంగపతిదేవిపేట పంచాయతీ, బోడి గూడెం పంచాయతీ పరిధిలోని ఐదు గ్రామాలకు చెందిన విద్యార్థులు కొయ్యలగూడెం చేరుకోవడానికి నానా ఇబ్బందులకు గురవుతున్నట్టు తెలిపారు. బోడిగూడెంలో ప్రభుత్వ పా ఠశాల, గ్రామపంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న రోడ్డుపై గుంతల్లో వర్షపు నీరు చేరి రాకపోకలకు అనేక ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆందోళనకు సీపీఐ మండల కన్వీనర్ జమ్మి శ్రీనివాస్ మద్దతు తెలిపారు. – కొయ్యలగూడెం

విష జ్వరంతో వ్యక్తి మృతి



నాగిరెడ్డిగూడెంలో జ్వరాల తీవ్రతపై ఆరా తీస్తున్న వైద్య బృందం

చింతలపూడి: విషజ్వరంతో చింతలపూడి మండలం నాగిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన పుచ్చా సీతారాముడు (35) మృతి చెందిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఈ నెల 1న సీతారాముడికి జ్వరం రావడంతో కుటుంబ సభ్యులు స్థానిక ఆసుపత్రిలో చికిత్స చేయించారు. అదే రోజు జ్వరం తీవ్రతరం అవ్వడంతో గుంటూరు తరలించారు. గుంటూరులో చికిత్స పొందుతూ సీతారాముడు మంగళవారం తెల్లవారు జామున మృతి చెందాడు. కాగ డెంగీ జ్వరం సోకడం వల్లనే మృతి చెదాడని కుటుంబ సభ్యులు ఆరోపిస్తుండగా గుంటూరు ఆసుపత్రి వైద్యులు మాత్రం కార్డియాక్ అరెస్ట్ వల్ల చనిపోయినట్టు రిపోర్టు ఇచ్చారు.

గ్రామాన్ని సందర్శించిన వైద్య బృందం

ఎంపీ పుట్టా మహేష్ యాదవ్ ఆదేశాలతో నాగిరెడ్డిగూడెం గ్రామాన్ని ఇన్‌చార్జి డీఎంఅండ్‌హెచ్‌ఓ ఎం నాగేశ్వరరావు, అర్బన్ హెల్త్ మెడికల్ ఆఫీసర్ కె అనిల్ కుమార్‌లు సందర్శించారు. గ్రామంలో జ్వరాలు ఎక్కువగా ఉండటం వల్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. గత నెల 31, ఈ నెల 1న వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి జ్వర పీడితుల నుంచి రక్త నమూనాలు సేకరించామని, వైద్య సిబ్బంది ప్రతి రోజూ గ్రామస్తులకు వైద్య సేవలు అందిస్తున్నట్టు అధికారులు తెలిపారు. గ్రామంలో పారిశుధ్య పరిస్థితులు అధ్వానంగా ఉన్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దోమలు పెరిగి విషజ్వరాలు ప్రబలుతున్నాయని ఆందోళన చెందుతున్నారు.

నేడు కౌన్సిల్ సమావేశం

జంగారెడ్డిగూడెం: స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశం బుధవారం ఉదయం 11.30 కౌన్సిల్ సమావేశ మందిరంలో నిర్వహిస్తామని కమిషనర్ నరేంద్రకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అధ్యక్షత వహిస్తారని పేర్కొన్నారు.

మద్ది అంజన్నకు పూజలు



అంజన్న క్షేత్రంలో భక్తులు

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి వారికి మంగళవారం అర్చకులు తమలపాకులో పూజలు చేశారు. భక్తులు 108 ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఒక రోజు స్వామివారి ఆదాయం రూ.1,24,175 వచ్చిందని, 1,200 మంది భక్తులు స్వామి వారి అన్నప్రసాదాన్ని స్వీకరించారని ఆలయ ఈఓ ఆకుల కొండలరావు తెలిపారు. ఆలయ పర్యవేక్షకులు జవ్వాది కృష్ణ, కురగంటి రంగరావులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి



గాయపడిన డ్రైవర్ బాబు

జంగారెడ్డిగూడెం: ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేసి సెల్‌ఫోన్‌ను చోరీ చేసిన ఘటన సోమవారం అర్ధరాత్రి జంగారెడ్డిగూడెంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొవ్వూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు రాజమండ్రి నుంచి జంగారెడ్డిగూడెం సర్వీసులో భాగంగా జంగారెడ్డిగూడెం వస్తుండగా సోమవారం సాయంత్రం స్థానిక ఫైర్ స్టేషన్ రోడ్డులో మరమ్మతులకు గురై నిలిచిపోయింది. బస్సు డ్రైవర్ పోలుమాటి బాబు కొవ్వూరు డిపోకు సమాచారం అందించగా, డిపో సిబ్బంది వచ్చి మరమ్మతులు చేపట్టారు. చీకటిగా ఉండటంతో ఆర్టీసీ డిపో డ్రైవర్ మెకానిక్ సిబ్బందికి తన సెల్‌ఫోన్ ద్వారా లైటు చూపిస్తున్నాడు. ఆ సమయంలో ద్విచక్రవాహనంపై వచ్చిన ముగ్గురు యువకులు డ్రైవర్‌తో మాటలు కలిపి సెల్‌ఫోన్ లాక్కొనేందుకు ప్రయత్నించారు. డ్రైవర్ వెంటనే స్పందించి వారిని అడ్డుకోవడంతో వారిలో ఓ యువకుడు పక్కనే ఉన్న రాయితో డ్రైవర్ తలపై బలంగా కొట్టి, డ్రైవర్ చేతిలోని సెల్‌ఫోన్‌ను లాక్కొని పారిపోయారు. దీంతో గాయపడిన డ్రైవర్ బాబును స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ యు.రవిచంద్ర, ఎస్సై జ్యోతిబాస్‌లు ఆసుపత్రికి వెళ్లి డ్రైవర్ బాబు వద్ద వివరాలు తెలుసుకున్నారు. డ్రైవర్ ఇచ్చిన ఫిర్యాదుతో ఎస్సై జ్యోతిబాస్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అడవులు జీవ వైవిధ్య నిలయాలు



కృష్ణాపురం అడవుల్లో విత్తనాలు చల్లుతున్న దృశ్యం

టి.నరసాపురం: అడవుల పరిరక్షణ ఉద్యమంలో భాగంగా లక్ష విత్తనాలు చల్లే లక్ష్యం దిశగా బంజారా బజరంగీ భేరి సంఘం ఆధ్వర్యంలో కృష్ణాపురం అడవుల్లో రెండో విడత వేప, నేరేడు, పనస విత్తనాలను మంగళవారం చల్లారు. ఈ సందర్భంగా సంఘ మండల నాయకులు భూక్యా బిగనాధం నాయక్ మాట్లాడుతూ జీవ వైవిధ్యానికి అడవులు నిలయాలుగా ఉంటూ మానవ మనుగడకు ఆధారభూతమవుతున్నాయని వివరించారు. పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో అడవులు ప్రముఖ పాత్ర వహిస్తాయని అన్నారు. సంఘ అధ్యక్షుడు జరభల చందా నాయక్ మాట్లాడుతూ వన్యమృగాలకు స్థావరంగా ఉన్న టి.నరసాపురం అడవులు వేగంగా అంతరించిపోతున్నాయని, వాటిని కాపాడుకునే దిశగా లక్ష విత్తనాలు చల్లే కార్యక్రమం చేపట్టామని చెప్పారు. కార్యక్రమంలో భూక్యా వేణు గోపాల్, ధరావత్ రవి, భూక్యా తేజ తదితరులు పాల్గొన్నారు.